

లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలు

ప్రజాశక్తి-మండపేట

వైసిపి ప్రభుత్వం వచ్చాక నేరుగా ఇంటి వద్దకే పథకాలు చేర వేస్తున్నారని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే ముడుపులు చెల్లిస్తే గాని పథకాలు అందని పరిస్థితులు ఉండేదన్నారు. అనంతరం వైసిపి నాయకురాలు పాలింకి కమల ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, రెడ్డి రాజాబాబు, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో కనీస వసతుల కరువు

- తరగతుల నిర్వాహణ ఎలా?
- పునాదుల్లోనే పాఠశాల భవనం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-మండపేట

సమాజ అభివృద్ధికి తోడ్పడే విద్యవ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న ఆచరణ మాత్రం శూన్యంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే తమ లక్ష్యమని చెబుతున్న నాయకులు, అధికారులు ఈ పాఠశాల వైపు కన్నెత్తి చూడడం లేదు. పాఠశాలలో కనీస సౌకర్యాల లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసౌకర్యాల నడుమ విద్యార్థులు విద్యాభ్యాస్యం కొనసాగిస్తున్నారు. అనేకమార్లు పాలకులు, ఉన్నాతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పట్టణ శివారు గొల్లపుంత కాలనీలోని సర్ధార్ వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను 2014 సంవత్సరంలో ప్రారంభించగా 2017లో అప్పర్ ప్రైమరీగా మారింది. ఈ పాఠశాలలో 1 నుంచి 7 తరగతులు ఉండగా బాలురు 72, బాలికలు 97 మందిగాను మొత్తంగాను 169 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఏడుగురు ఎస్‌జిటిలు ఉండగా అందులో ముగ్గురు రెగ్యూలర్ కాగా మరో నలుగురు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో రెండు గదులు ఉండగా రెండు తరగతులు ఒరండాలోను మిగిలిన తరగతులను పాఠశాలకు సమీపంలో ఉన్న అద్దెభవనం, మార్కెట్ షెడ్డులలో నిర్వహిస్తున్నారు.



గొల్లపుంత కాలనీలో మార్కెట్ షెడ్డులో నిర్వహిస్తున్న తరగతులు



గొల్లపుంత కాలనీలో పునాదుల్లో ఉన్న పాఠశాల భవనం

పాడైపోతున్న భవన నిర్మాణ సామగ్రి

నాడు-నేడు కార్యక్రమంలో ఈ పాఠశాల రూ.60 లక్షలతో చేపట్టిన 5 అదనపు తరగతుల భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది. పనులు కొంత కాలంగా ముందుకు సాగకపోవడంతో భవన నిర్మాణ సామగ్రి పాడైపోతున్నాయి. అంతేకాకుండా వరండాలో ఉంచిన భవన నిర్మాణ సామగ్రితో మరింత ఇరుకుగా మారింది.

అద్దెభవనం,షెడ్డులో తరగతుల నిర్వహణ

ప్రస్తుతం భవనంలో ఉన్న రెండు గదుల్లో రెండు తరగతులు జరుగుతుండగా మరో రెండు తరగతులు ఒరండాలోను మిగిలిన తరగతులను పాఠశాలకు సమీపంలో ఉన్న అద్దెభవనం, మార్కెట్ షెడ్డులలో నిర్వహిస్తున్నారు. అయితే గతం ఈ పాఠశాల మున్సిపల్ కార్యాలయం ఆధీనంలో ఉన్నప్పుడు అద్దె భవనానికి మున్సిపల్ కార్యాలయం అద్దె చెల్లించేది. ప్రస్తుతం పాఠశాలలు అన్ని విద్యాశాఖ అధీనంలోకి ప్రభుత్వం తీసుకురావడంతో ప్రభుత్వం నుంచి అద్దె, పాఠశాల మెయింటెనెన్స్ రాకపోవడంతో ఉపాధ్యాయులే అద్దె చెల్లిస్తున్నారు. పాఠశాలలో డైనింగ్ హాలు లేకపోవడంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు యంత్ర సామగ్రి మధ్య భోజనాలు చేస్తున్నారు. పాఠశాల గ్రౌండ్ అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థుల మానసికోల్లాసానికి పరిపక్వతను పెంపోందించడానికి ఎంతగానో ఉపయోగపడే క్రీడలకు విద్యార్థులు దూరమవుతున్నారు.

పాఠశాల చుట్టు రక్షణ గోడ లేకపోవడంతో పాఠశాల ఆస్తులకు రక్షణ లేకుండాపోయింది. తరచు ఆకతాయిలు మరుగుదోడ్ల కుళాయిలు విరగగొట్టి తలుపులు బద్దలు కొడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

కొన్ని తరగతులు అద్దెభవనంలో మరి కొన్ని మార్కెట్ షెడ్డులోను నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంతోపాటు విద్యార్థులు చదువుకునేందుకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుచున్నారు.

సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవించాం

ఈ విషయాలపై జిల్లా, మండల విద్యాశాఖధికారులు కమలాకుమారి, నాయుడు రామచంద్రరావులను వివరణ కోరగా నాడునేడు పనులు నిలిచిపోవడం, తదితర పాఠశాల సమస్యలను ఉన్నాతాధికారులకు ఇప్పటికే విన్నవించామన్నారు.


కనీస సౌకర్యాలు కల్పించాలి



పాఠశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులు కాలనీలోనే10వ తరగతి వరకు చదువుకునేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి. క్రీడలు ప్రోత్సహించే విధంగా పాఠశాలలో గ్రౌండ్‌ను అభివృద్ధి పర్చడంతోపాటు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

-కె.కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి, మండపేట

పాఠశాల ఆస్తులకు రక్షణ కల్పించాలి



గొల్లపుంత కాలనీలో మున్సిపల్ పాఠశాల్లో ఇరుకు గదుల్లో వస్తు సామగ్రి మధ్య విద్యను విద్యార్థులకు బోధిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం, అధికారులు ఈ పాఠశాలపై ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన పనులు పూర్తి చేయడంతో పాటు పాఠశాల చుట్టు రక్షణ గోడ ఏర్పాటు చేసి పాఠశాల ఆస్తులకు రక్షణ కల్పించాలి.

-కోన సత్యనారాయణ, బిసి సంఘనాయకులు, మండపేట

త్వరలో బిసి కులగణన ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

త్వరలో ప్రారంభం బిసి కుల గణన ప్రారంభమవుతుందని, బిసి కులాలను జాగృతం చేస్తూ పలు సమావేశాలు నిర్వహిస్తామనిఎంఎల్‌సి కుడుపూడి సూర్య నారాయణ అన్నారు. తన కార్యాలయం లో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కుల గణన జరగాలని తాము కోరుతున్నాం అని ఇప్పటి వరకు పాలకులు పట్టించుకోలేదన్నారు. అయితే సిఎం జగన్ ఈ విషయం లో ముందుకు వచ్చి జి ఓ ఇచ్చారని అన్నారు. బిసి ల అభ్యున్నతికి పోరాటం చేస్తానని కుడుపూడి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, గుత్తుల సుబ్రహ్మణ్యం, దండుమెను రూపేష్, గుత్తుల ధర్మారావు, కడలి దుర్గ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్నఎంఎల్‌సి సూర్య నారాయణ

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆశాఖ అధికారులు గురువారం తెలిపారు.

మండపేట సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు 11కెవి ఇండస్ట్రియల్ ఫీడెర్స్ లైన్లలో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు అన్ని ఇండస్ట్రీస్ కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆ శాఖ రామచంద్రపురం ఇఇ వై.విజయానంద్ గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. **కాట్రేనికోన:** నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కాట్రేనికోన, చెయ్యరు సబ్ స్టేషన్ పరిధిలో చెట్లు తొలగింపు పనులు చేపడతారన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అంతరాయం కలుగుతుందని రవి కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల గమనించి సహకరించాలన్నారు. **కొత్తపేట** 33కేవీ లైన్ ట్రీ కటింగ్ చేయు నిమిత్తం కొత్తపేట మండలం పరిధిలోని బిళ్ళకుర్రు, వానపల్లి, అవిడి, మొడెకుర్రు, కండ్రిగ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారనిఅమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు గురువారం హైదరబాద్‌కు చెందిన డాక్టర్ సాయిరామ్ మాచిరాజు కుటుంబ సభ్యులు మాచిరాజు ఫణి రాజ్ కిరణ్, అనూష దంపతులు రూ.50వేలు, అలాగే కె.మోహన్ కష్ణ దంపతులు రూ.1,00,000 విరాళాలు అందజేశారని ఇఒ సతీష్ రాజు తెలిపారు.దాతలు ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.



దాతలకు స్వామి వారి చిత్రపటాలను అందజేస్తున్న దృశ్యం



రోడ్డు చెంతనే ఉన్న పశువుల వ్యర్థాలు

బైపాస్ రోడ్డు చెంతనే పశువుల వ్యర్థాలు

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండపేట బైపాస్ రోడ్డు లోని ఏడిద రోడ్డు జంక్షన్ వద్ద పశువుల వ్యర్థాలు రోడ్డు చెంతనే వేస్తూ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల వ్యర్థాల నుంచి దుర్వాసన వెదజల్లుతుండంతో వాహనదారులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతమంతా బురద మయంగా మారి దోమలు, క్రిమి కీటకాలకు నివాసంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టి రోడ్డు వెంబడి ఉన్న పశువుల పెంటను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన వైసిపి నేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బండారులంకకు చెందిన వైసిపి నేత, చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాన జగదీష్ చంద్ర గణేష్ గురువారం మంత్రి అమర్ నాథ్ ను కలిశారు. రాష్ట్రంలో ప్రస్తుత చేనేత సహకార సంఘాల పరిస్థితిని గణేష్ మంత్రికి వివరించారు. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం ద్వారా సంఘాలకు రావలసిన రిబేటు, డిస్కౌంట్, నూలు సబ్సిడీ, పావలా వడ్డీ నిధులను విడుదల చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు.

కొనసాగిన టిడిపి శ్రేణుల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఆ పార్టీశ్రేణులు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగాయి.

అమలాపురం చంద్రబాబుకు మద్దతుగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద జరుగు సామూహిక నిరాహారక దీక్ష శిబిరం ఏర్పాటుచేశారు నియోజకవర్గం లో అమలాపురం అసెంబ్లీ ఇన్చార్జ్ ఆనందరావు అధ్యక్షతన అల్లవరం మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో క్షత్రియ సంఘం వారు దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో వేగిరాజు వెంకటరాజు, పిన్నమరాజు గాంధీ రాజు, గుంటూరి బాల, కలిదిండి వెంకటేశ్వరరాజు, గుంటూరి శ్రీనివాసరాజు, నడింపల్లి సుబ్బరాజు, పొత్తూరి రంగరాజు, గుంటూరి రఘురాజు, నడింపల్లి సుబ్బరాజు, అల్లూరి శ్రీనివాసరాజు, పెనుమత్స సుబ్రహ్మణ్యం రాజు, ముదునూరి వాసు రాజు, పెనుమత్స కష్ణంరాజు తదితరు పాల్గొన్నారు. **మండపేట** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన తలపెట్టిన రిలే నిరహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి మన రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి వెళ్ళిపోయిందన్నారు. ఎక్కడ చూసిన రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, దౌర్జన్యం దోపిడీలు, నిత్య కత్యాలుగా మారాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, షేక్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండపేటలో టిడిపి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ గురువారం సాయంత్రం చేపట్టారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించిన చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి టౌన్ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండపేటలో కొవ్వొత్తులతో నిరసన



అమలాపురంలో నిరాహార దీక్ష చేస్తున్న పార్టీ శ్రేణులు

'కవికోకిల'కు ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

కవి కోకిల, మహాకవి గుర్రం జాషువా జీవిత కష్టాల్లోంచి కవిత్వం పుట్టిందని, అభ్యుదయ భావాలతో చైతన్యాన్ని కలిగించే రచనలు చేశారని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కవులు అన్నారు.గురువారం మహాకవి గుర్రం జాషువా129వ జయంతి సందర్భంగా కూచిమంచి అగ్రహారంలోని సాయి సంజీవని ఆసుపత్రి ఆడిటోరియంలో జరిగిన సాహిత్య సభలో శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ వడగల్పులు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం అని ప్రకటించిన కవి శిఖరం జాషువా అని నరసింహమూర్తి అన్నారు. ప్రముఖ కవి బివివి. సత్యనారాయణ మాట్లాడుతూ జాషువా గబ్బిలం కావ్యంపై ప్రసంగించారు. తెలుగు అధ్యాపకుడు మాకే బాలార్జున సత్యనారాయణ మాట్లాడుతూ ఖండకావ్యాలకు అఖండ్యాతిని తెచ్చిన మహాకవి జాషువా అని ఆయన కొనియా డారు. సమావేశానికి ముందు జాషువా చిత్రపటానికి కళావేదిక ఉపాధ్యక్షులు గుర్రం రామకష్టారావు, విశ్రాంత భవిష్యనిధి అసిస్టెంట్ కమిషనర్, న్యాయవాది అద్దంకి అమరేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో సాయి సంజీవిని వాకర్స్ యోగ ఆరోగ్య సంస్థ మహిళా అధ్యక్షురాలు జల్లి సుజాత, కడలి సత్యనారాయణ, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, చాట్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ వై డి బి వెంకటేష్, డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, పిఆర్‌ఒ రమేష్, పాల్గొన్నారు.



జాషువా చిత్రపటం వద్ద పలువురి నివాళి

రెల్లిగడ్డలో 'మహా సంకల్ప యాత్ర'

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం రెల్లిగడ్డ గ్రామంలో గురువారం అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి శెట్టిబత్తుల రాజబాబు మహాసంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి రాజబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా మా గ్రామంలో జగనన్న కాలనీ ఇచ్చినప్పటికీ నిరుపేదలు ఎవరికీ కూడా ఇళ్ల స్థలాల కేటాయించలేదని మహిళలు రాజబాబు దృష్టికి తీసుకుని వచ్చారు. దళితవాడలో డ్రైనేజీలు, సరైన రహదారులు లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మోకా బాలయోగి, సందడి శ్రీనుబాబు, కంకిపాటి వీరబాబు, నామాడి నాగరాజు, చవల వెంకటేశ్వరరావు, చాట్ల సత్యనారాయణ, మహా దశ నాగేశ్వరరావు, చిక్కం భీముడు, చిక్కాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త స్వామినాథన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-మండపేట

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు సంతాపం తెలిపారు. స్వామినాథన్ జీవితాంతం వ్యవసాయ రంగంలో రైతులకు మేలు చేసే ఎన్నో రకాల పరిశోధనలు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు ఇచ్చి గౌరవించిందన్నారు. రామన్‌మెగసేస్ అవార్డు అందుకుని హరిత విప్లవ పితమహునిగా పేరు పొందిన గొప్ప వ్యక్తి అన్నారు. రైతుల కోసం నిరంతాయంగా పాటుపడుతూ రైతు పండించిన పంటకు మద్దతు ధర ఉండాలని మినిమం సపోర్ట్ ప్రైస్ ఇవ్వవలసిన అవసరం ఉన్నదనీ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన గొప్ప శాస్త్రవేత్త అన్నారు.



పొన్నాడ సతీష్ ను సత్కరిస్తున్న అడ్వకేట్ అశోక్

ప్రజాప్రతినిధులను కలిసిన అశోక్

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి లీగల్ సెల్ అధ్యక్షునిగా అమలాపురానికి చెందిన కుడుపూడి అశోక్ ఇటీవల నియమితుల య్యారు. ఈ సందర్భంగా జిల్లా వైసిపి అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్ కుమార్, ఎంఎల్‌సి కుడుపూడి సూర్య నారాయణ రావును వారి కార్యాలయాల్లో గురువారం అశోక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ కౌన్సిలర్ సంసాని బుల్లి నాని ఉన్నారు.

30న మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు. కౌన్సిల్ సమావేశంలో చర్చించే అంశాల అజెండాను ఛైర్‌పర్సన్ విడుదలచేశారు.




తమ్మన శ్రీనివాస్‌కు అభినందన సత్కారం

వైసిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆలమూరు

వైసిపి అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఆ పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని చెముడులంకకు చెందిన ఆయన్ని మరో మారు మండల కన్వీనర్‌గా ఎంపిక చేసి గురువారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ముందుగా పార్టీ శ్రేణులు ఆయనకి అభినందన సత్కారం చేశారు. అలాగే ఆయనకు ఎంపిడిఒ జాన్ లింకన్ మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేకమైన శుభాకాంక్షలు అందజేశారు. ఇందులో భాగంగా కేకును కట్ చేసి పలువురు తమ్మనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్, తమ్మన హరి, బి.వీర వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నాసిరకం మద్యంతో మరణాలు

ఘనంగా దివాకర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర రెవెన్యూ జెఎసి ఛైర్మన్, కోనసీమ జెఎసి ఛైర్మన్, ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కో ఛైర్మన్ విఎస్ దివాకర్ పుట్టినరోజు వేడుకలు గురువారం అమలాపురంలో ని ఆయన స్వగహంలో అభిమానులు సమక్షంలో ఘనంగా జరిగాయి. ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణరావు దివాకర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా రెవెన్యూ సంఘాలు, వైసిపి, టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు, విఆర్‌ఒల జిల్లా అసోసియేషన్, సర్వేయర్ల అసోసియేషన్ పంచాయతి రాజ్ అసోసియేషన్ నాయకులు తదితరుల వచ్చి దివాకర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు విఆర్‌ఒ సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల ఏలేశ్వరావు, ఆరవ పూర్ణచంద్రరావు తిక్కిరెడ్డి నేతాజీ మోకా వెంకట సుబ్బారావు, అధికారి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న దృశ్యం

యనమదల్లో సూర్య ప్రకాష్ పర్యటన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని యనమదల గ్రామంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్ గురువారం రాత్రి పర్యటించారు. ఈ పర్యటన గ్రామ పెద్దలు మహిళలు అభిమానులు నాయకులు వచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనకు అందరి మద్దతు కావాలన్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మొల్ల ముస్తఫా మసీదులో గురువారం మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నపిల్లలు ఉర్దూ, అరబిక్ లో పాఠ్యాంశంలో చదువుల పోటీ, ఇమామ్ మొహమ్మద్ రాజా సాహెబ్ చే ముబారక్ షరీఫ్ వాజ్, అమలాపురం పురవీధుల్లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమ్ కాస్ దావత్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అమీర్, మహమ్మద్ ఆజం, మొహిద్దిన్, బషీర్, ఎస్.లాల్, సాజిద్ హజారీ, నిజాముద్దీన్, ఖాదర్ వలీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం' వాయిదా

ప్రజాశక్తి-అమలాపురం

ఉప్పలగుప్తం మండలం లో శుక్రవారం జరగవలసిన జగనన్నకు చెబుదాం మండలస్థాయి కార్యక్రమం కొన్ని అనివార్య కార్యక్రమాల కారణం గా వాయిదా వేయబడింది అని కలెక్టరేట్ అధికారులు గురువారం ఓ ప్రకటన లో తెలిపారు.అక్టోబర్ 4 బుధవారం రోజున అయినవిల్లి మండలం లో తదుపరి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

జిల్లా స్థాయిలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో దంగేరు విద్యార్థిని ప్రవల్లిక సత్తా చాటింది. ఈ మేరకు ఐ.పోలవరం లో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలో జిల్లా పరిషత్ హై స్కూల్ దంగేరు విద్యార్థిని పీవీ. ప్రవల్లిక తతీయ స్థానం సాధించింది. ఈ మేరకు దంగేరు హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రవల్లికను అభినందించారు. ముందు ముందు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా వారు అన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రవల్లిక

నేరాలు ఘోరాలు

మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఇబి శేరు సూరకాలు తెలిపారు. స్థానిక దరియాలతిప్ప ఫ్లడ్ బ్యాంక్ రోడ్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న 384 బీరు బాటిళ్లను పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.43 వేల ఉంటుందన్నారు. పట్టుకున్న మద్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు ఏలేరు రిజర్వాయర్ ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలేరు పరివాహక ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం ఉంచిన బెల్లపు ఊట ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం పేరవరంలో పరివర్తన 2.0 పేరుతో అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాస రావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జునబాబు, ఎం.వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం జి మేడ పాడు-పెదబ్రహ్మదేవం మధ్యలో విజయవాడ కు వెళ్లే అప్ లైన్ ట్రాక్ పై గుర్తు తెలియని రైలు కింద పడ తిమ్మాపురం వాసి పెదపూడి నాగ గంగా సత్య శ్రీనివాస్ (36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సామర్లకోట రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం శ్రీనివాస్ ఈ ఉదయం ప్రాంతం లో గుర్తు తెలియని రైలు కింద తల తలపెట్టి ఆత్మ హత్య కు పాల్పడ్డాడన్నారు. అయితే ఆత్మహత్య కు గల కార ణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి జిఆర్పి ఎస్ఐ బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు రైతు కూలి మృతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

పాముకాటుకు గురై వ్యవసాయ కూలి మృతి చెందిన సంఘటన తిరుమాలి గ్రామంలో తీవ్ర విషాదానికి గురి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాల రాంబాబు (48) తిరుమాలి గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. యథావిధిగా గురువారం మధ్యాహ్నం పొలం పనికి వెళ్లిన రాంబాబును పాము కాటేసింది. దీంతో స్థానికులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య దేవి, కుమారులు నూకరాజు, సత్తిబాబు ఉన్నారు.



బురద సమస్యపై ఆందోళన తెలుపుతున్న ప్రజలు

బురద సమస్య పట్టదా?


ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ 31వ వార్డులో నివాసాల మధ్య రహదారి బురదమయంగా మారి అత్యంత దారుణంగా ఉండడంపై ఆ వార్డు ప్రజలు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా తమ నివాసాల మధ్య బురద వీడకుండా ఉండడంతో ఇంటి నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు నీళ్లు పట్టుకునే కుళాయి సైతం బురదలో చిక్కుకుని ఉందని తెలిపారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ఇళ్లలోకి విషపురుగులు వచ్చి చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. దోమలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో ప్రజల నుంచి నేడు 'జగనన్నకు చెబుదాం' అర్జీలను స్వీకరిస్తామని కమిషనర్ కె. దినేష్ కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అర్బన్కు సంబంధించి జెకెసి కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, నగర ప్రజలు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియ చేయవచ్చునని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతాదని తెలిపారు.



కవి నేలపూరి రత్నాజీని సత్కరిస్తున్న దృశ్యం

జాతీయ అవార్డు గ్రహీత 'నేలపూరి'కి సత్కారం

ప్రజాశక్తి - చాగల్లు

జాతీయ అవా ర్డును అందుకున్న చాగల్లు గ్రామానికి చెందిన కవి నేల పూరి రత్నాజీని ఘనంగా సత్కరించారు. కృష్ణా జిల్లా కంచికర్లలో గుర్రం జషువా 128 వ జన్మదినం పురష్క రించుకుని ఆయనను దుశ్శా లువాతో ఘనంగా గురువారం సత్కరించారు.. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

'చలో విజయవాడ' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య భవన్లో ఈ మేరకు ముద్రించిన పోస్టర్లను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం మొత్తం కార్పొరేట్, ప్రయివేటు పరమవుతుందన్నారు. ఈ విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా అమలుకాని నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. తరగతులు ప్రారంభించి నాలుగు నెలలైనా నేటికీ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదన్నారు. పేదర్ డిగ్రీ విధానం కారణంగా అడ్మిషన్లు పూర్తికాలేదన్నారు. ఆన్లైన్ అడ్మిషన్ ప్రక్రియ ఆపాలని, హానర్స్ డిగ్రీ రద్దు చేయాలని, జిఒ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వాసు, సాహిత్య, ఆదర్శ కార్తిక్, పవన్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న శాంతకుమార్

లాయర్లకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి -కాకినాడ

లాయర్లకు రక్షణ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ తెలిపింది. గురువారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐలు) సమావేశం సీనియర్ న్యాయవాది కుంచే శ్రీహరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఐలు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలు కోల్పోయిన హక్కుల కోసం పోరాడడం ఐలు లక్ష్యమన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు సమాన ప్రాతినిధ్యాలను కల్పించాలన్నారు. ఎజిపి, పిపి పోస్టులకు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలను ఎంపిక చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నాగాబత్తుల రాంబాబు ఆహ్వానం పలకగా రాష్ట్ర ఐల నాయకుడు గుంటి సురేష్ బాబు, ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ యు.విష్ణుకుమార్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కోట రామ్మోహన్రావు, పినిపే రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్గా నాగాబత్తుల రాజబాబు, కో-కన్వీనర్గా వడ్డి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సామర్లకోటలో కుండపోత

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

అల్పపీడన ప్రభావంతో సామర్లకోట పట్టణంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పట్టణమంతా చెరువయ్యింది. ఎక్కడ చూసినా ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, ఆర్టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ఆవరణ అన్ని ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. గంటకు పైగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలో జనజీవనం స్తంభించింది. డ్రెయినేజీలు పొంగడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. రైల్వే స్టేషన్ ఎదురుగా, కెనాల్ రోడ్డుపై ఐదు తూముల వద్ద, కాకినాడ రోడ్ లోని పలు ప్రాంతాల్లోనూ వర్షపు జలాలు రోడ్లపై ప్రవహించాయి. వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టిసి బస్టాండ్ పూర్తిగా నీటమునగడంతో ప్రయాణికుతు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రేబిస్ టీకాలు వేయించాలి

కాకినాడరూరల్ : పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలని పశు వైద్యులు డాక్టర్ తలాటం సురేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కుక్క, పిల్లి, గబ్బిలం వంటి వాటికి వైరస్ ఉంటే అవి కరిస్తే మనుషులకూ రేబిస్ వస్తుందన్నారు. కుక్క కరిచిన వెంటనే సబ్బు నీటితో శుభ్రం చేయాలని అనంతరం ఇంజక్షన్లు చేయించుకోవాలని సూచించారు. రేబిస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 60 వేల మంది మరణిస్తున్నారన్నారు. ప్రాణాంతక వ్యాధి అయినందున దీన్ని నియంత్రించడానికి 2007 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ 28న ప్రపంచ రాబిస్ నివారణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని సురేష్ తెలిపారు. అనంతరం జాతీయస్థాయిలో ఉత్తమ సర్జన్ పురస్కార గ్రహీత అయిన డాక్టర్ సురేష్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, యనమల రామం, ఎస్. శ్రీ నగేష్, మీనాక్షి, సుబ్బారావు, శిరీష పాల్గొన్నారు.

ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

పెద్దాపురం : మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక జామియా మసీదు ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, అంజుమన్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్, షేక్ గౌస్ రఫీ, బాబూలాల్, దొరబాబు, ఎపి అగ్రో డైరెక్టర్ కరీం జానీ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానాలు

పెద్దాపురం : గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా పెద్దాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో,పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం అన్నదానాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు, చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇనుకొండ విష్ణు చక్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రౌతులపూడి మండలం బలరామపురం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని అన్నదానాలు చేశారు. రౌతులపూడిలో సత్యదేవ కాలనీవాసుల ఆధ్వర్యంలో, బలరామపురంలో కొత్త రామాలయం వద్ద యువత ఆధ్వర్యంలో అన్నదానాలు జరిగాయి.

హుస్సేన్పురంలో టిడిపి రిలే దీక్షలు పాదయాత్ర

సామర్లకోట రూరల్ : చంద్రబాబుకు మద్దతుగా సామర్లకోట మండలం హుస్సేన్పురంలో గురువారం టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేశారుర. అనంతరం గ్రామంలో పాదయాత్రను చేపట్టారు టిడిపి గ్రామ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రలో ఎంఎల్ఏ చిన రాజప్ప తమయుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, జి.రామకృష్ణ, తోటకూర శ్రీనివాస్, పాల్గొన్నారు.

కెసిబిఎంఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

కెసిబిఎంఎస్ శతాబ్ది ఉత్సవాల్లోభాగంగా ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పవర్ ట్రినిటీ హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆంకాలజిస్ట్, డాక్టర్ అమృత, పల్మనాలజిస్టు డాక్టర్ ప్రియాంకదర్శిని ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమానికి కెసిబిఎంఎస్ అధ్యక్షులు కోసూరి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్ర కుమార్, డైరెక్టర్లు ముత్యా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మి ప్రసాద లావణ్య, ఇంచార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సంఘ సభ్యులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ప్రకృతి సాగుతో లాభాలు

జగ్గంపేట రూరల్ : ప్రకృతి సాగుతో లాభాలు పొందొచ్చని క్లస్టర్ అధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో ఎస్ఎల్ఎస్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టామన్నారు. గురువారం గొల్లలగుంటలో కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఆదేశాల మేరకు విఒలో కంపెక్ట్ బ్లాక్ మోడల్లో కొంతమంది రైతులు కలిసి ఎస్ ఎల్ ఎస్ విధానంలో చేపట్టిన ప్రకృతి సాగును ఆమె పరిశీలించారు. యెల్లో షీట్స్, ఫ్లవర్ షీట్స్, లింగార్గ ట్రాప్స్ పట్టలు రైతులు తమ పొలాల్లో పెట్టారన్నారు. గట్లపై వంగ, మిర్చి, బంతి మొక్కలు వంటి పలు రకాల పంటలను వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు, మండల డిజిటల్ ఇంచార్జి పద్మా రజిని, నాగేశ్వరావు, గౌరి, సత్యనారాయణ, కృష్ణవేణి, వీరరాఘవ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కాకినాడ కార్పొరేషన్ : నగరంలో ముస్లిములు మిలాద్ ఉన్ నబీని గురువారం ఘనంగా నిర్వహించారు. రమణయ్యపేట మార్కెట్ సమీపంలో గల మస్జిద్-ఏ- ఖుబా నుంచి ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ జహంగీర్ మిలాద్ ఉన్ నబీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గౌస్, హుస్సేన్, రోషాన్, అలీషా, బాషా, ఖాజా, ఇస్మాయిల్, రియాజ్, మహ్మద్ పాల్గొన్నారు.

దళిత లబ్ధిదారులకు భూములు అప్పగించాలి

ప్రజాశక్తి-తాళ్ళరేవు

దళితులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాళ్ళరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పటవల బూరుగు పుంత ప్రస్తుత పైడా కళాశాల వెనుక ప్రాంతంలో సర్వేనెంబర్ 486/4, 486/ 2 లో పంట కాలువ గట్టున పటవలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 30 సెంట్లు చొప్పున 1977లో దళితులకు భూమి కేటాయించిందన్నారు. ఆ భూముల్లో పైడా కళాశాల యాజమాన్యం అక్రమ కట్టడాలు నిర్మించి, మిగిలిన భూముల్లో చెత్త వేసి లబ్ధిదారులకు ఆటంకం కలిగిస్తోందని ఆ భూములను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని ప్రభుత్వానికి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారన్నారు.

ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు ఈనెల 28న ఆధారాలతో రావాలని లబ్ధిదారులకు నోటీసులు పంపించింది అన్నారు. అయితే లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయానికి రాగా కార్యాలయం తాళం వేసి ఉందని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ తెలిపారు. లబ్ధిదారులను ఆధారాలతో రమ్మన్న అధికారులు సెలవు రోజు పరిశీలించకుండానే తేదీ నిర్ణయించడం, లబ్ధిదారుల పట్ల అధికారుల అలసత్వం బయటపడిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిలిచారు. కార్యక్రమంలో దళిత లబ్ధిదారులు, వారి వారసులు మురమళ్ళ శ్రీను, దడాల సత్యనారాయణ, వేలంగి సత్యనారాయణ, నేల సత్యనారాయణ, మురుగు సాయిబాబు, నాగాబత్తుల అప్పారావు మాట్లాడారు. పైడా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని మా భూములను తిరిగి మాకు అప్పగించాలని లబ్ధిదారులు కోరారు.



తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత లబ్ధిదారులు

ఉత్సాహంగా గణపతి లడ్డూల వేలం

ప్రజాశక్తి-తాళ్లరేవు

గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా పలుచోట్ల లడ్డూల వేలం పాటలు గురువారం ఉత్సాహంగా సాగాయి. పి.మల్లవరంలో నిర్వహించిన లడ్డూ పాటలో హైటెక్ బ్యాచ్ సభ్యులు రూ.75 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. జి.వేమవరం మట్లపాలెం కాలనీ వినాయక మండపంలో ఏర్పాటు చేసిన 50 కిలోల లడ్డూను స్థానిక వైసిపి నాయకుడు దెయ్యాల సత్తిబాబు రూ.28,500 కు వేలంపాటలో దక్కించుకున్నారు. పాతకోరంగిలో వినాయక లడ్డూను చల్లా వెంకటేశ్వరరావు మనమడు అడబాల వీరబాబు రూ.13 వేలకు దక్కించుకున్నారు. పాతకోరంగి శెట్టిబలిజ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను యువజన సంఘం సభ్యులు రూ.9, 500కు పాడుకున్నారు.

పాతకోరంగిలో భారీ అన్నదానం

గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి పి.జగదీష్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలోని పుష్కర ఘాట్ వద్ద పోలీసు బందోబస్తు, వినాయకుని నిమజ్జనం ఏర్పాట్లును గురువారం రాత్రి ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కర ఘాట్ దగ్గరలో ఉన్న వినాయక నిమజ్జన ప్రదేశమైన ఇసుక ర్యాంపు వద్ద జరుగుచున్న నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయకుని ఊరేగింపుల సమయంలో రోడ్లమీద ఎటు వంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా, నిర్ధిష్ట మార్గాలను కేటాయించి, రూట్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎటువంటి ప్రాణహాని జరగకుండా, గజ ఈతగాళ్లను పెట్టి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

మత్స్యకార మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

ప్రజాశక్తి-తాళ్లరేవు

మత్స్యకార మహిళలకు ఫిష్ వాల్యూ ఎడిషన్కి సంబంధించి వృత్తినైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో యుఎన్డి పి.జిసిఎఫ్ సౌజన్యంతో మండల పరిధిలోని 50 మందికి శిక్షణ కార్యక్రమాన్ని మత్స్యశాఖ ఎడి లావణ్య గురువారం ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ శిక్షణ జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్డిఒ జి.గోపి, గ్రామ మత్స్య సహాయకులు, సాగర మిత్రలు సిబ్బంది పాల్గొన్నారు.